
# దొంగలు

— మంచికంటి



**"ఏమేవ్ సుబ్బులూ యాడుండావే? ఈ యాళప్పుడు యాడ పెత్తనాలు చెయ్య బోయావే?" అంటూ గుడిసెలోకి తొంగి చూస్తూ చేతికర్ర తడికకి ఆనించాడు నారయ్య.**

"ఇదిగో వొస్తుండానయ్యా ఇల్లలుకుదామని పేడ తీసుకుని రాబోయా" అంటూ రెండు చేతుల్తో తెచ్చిన పేడను తడిక పక్కన వేసి, చేతులు కడుక్కుని లోపలికి నడిచింది.

"సిన్నోడేమి సేస్తుండాడే" అంటూ సుబ్బులుతో పాటు గుడిసెలోకి నడిచాడు నారయ్య.

"ఇదిగో ఈ యాళప్పుడు నిద్రకి పడ్డాడు" అంటూ పొయ్యి పక్కనున్న అన్నం దబర బోర్లాబడి ఉండడము చూసి "అయ్యా దీనెమ్మా కడుపుగాల సద్దికూడు కుక్క తినిపోయినట్టుందయ్యా! అయ్యయ్యో ఇప్పుడెట్టజెయ్యాలయ్యా. ఇంక ఇంట్లో చిటికెడు బియ్యం గూడా లేవు. మద్దినాల కొద్దిగా తిని నీకు పైటేలకి ఉంచానయ్యా! ఇయ్యాల అయ్యగారొస్తారు గదా రేపు బియ్యం తెచ్చుకోవొచ్చులే అనుకున్నా. ఇయ్యాల్టికింక పస్తేను మామా" అంది సుబ్బులు.

"పేరు గొప్పా ఊరు దిబ్బ అంటే ఇదేనే. పేరుకేమో కోటీస్పరుడు. ఆయన దగ్గిర పనోళ్ళ మంటేనే గొప్ప అంటుంటివి గదే! ఏ పూటకాపూట పొయ్యిమీదకి, పొయ్యి కిందకి ఎతుక్కోవటమేందీ చీ ఏం బతుకో ఏం పాడో.

మనం పెద్దయ్యగారి దగ్గిర పనిజెయ్యటానికి కుదిరేనాటికి అయ్యాగారెంతటోళ్ళో మనకి తెలుసు. ఆ తరవాత వాళ్ళకి పట్టిందల్లా బంగారమైపోబట్టి యాపారాలు ఎదిగొచ్చినియ్యి. అంతస్తు మీద అంతస్తు పెరిగింది. పెద్దయ్యగారు పోయే. చిన్నయ్యగారు పెత్తనంలో కొచ్చారా! ఈయనా కాయక్కాయ సంపాయిచ్చడంలో మొనగోడనిపిచ్చుకున్నాడా. అయినా పిల్లికి బిచ్చం బెట్టే రకం గాకపోయా!

మనమేమో ఈ కమతంలో చేరినప్పుడు

ఎట్టుండామో ఇప్పుడు అట్నే చింపిరి జుట్లేసు కుని ఉంటిమి” అని విసుక్కున్నాడు నారయ్య.

“ఇదుగో అట్ట మాట్టాడబాక లేయ్యా. ఏదో ఒక్కర్నే నమ్ముకోనుండాము కాబట్టి కదా! దిగులూ ఇశారమూ లేకుండా నాలుగేళ్ళూ నోట్లోకి పోతుండయ్యి.” అన్నది సుబ్బులు నారయ్య వంక జూస్తూ.

‘నీకు లేదు లేయే దిగులు. ఎందుకిట్టాంటి మాటలు చెబుతావు. ఊళ్ళో ఉంటే ఏదన్నా వొక వొస్తువు కావాలంటే తటాలున అందుకో వొచ్చు. ఊరొదిలి ఈ రొయ్యల గుంటల దగ్గర ఎడారిలో బెట్టిచ్చాడు కదా కాపురం. ఇక్కడేమన్నా పిలిస్తే పలికే దిక్కేమన్నా ఉందా? ఈడకి తీసుకొచ్చి ఒక సుట్టు గుడిసె ఏపి చ్చాడు. ఆయన జెప్పినట్టు కుక్కిరిమిక్కిరి ఆడ కుండా పడుందామన్నా కనికరమైనా లేకపో యెనే, మనలాంటోళ్ళంటే పెద్దోళ్ళకెప్పుడూ చిన్న సూపేనా!

ఇంతిదిగా అయ్యగారి మీద మాట పడనియ్యడము లేదే. ఎసుట్లోకి బియ్యం లేవు ఎవుర్నని అడుగుతావు. రేప్పొద్దున్నదాకా పస్తేగా! అదీ ఇయ్యాల అయ్యగారొస్తేనే! లేదం టే? ఏందో ఈ మాయదారి బతుకు” అను కుంటూ విసుగ్గా కర్రదీసుకుని, ‘ఇదుగో ఆ పడ మట గట్టున ఉంటాగానీ అయ్యగారొస్తే చెప్పు. అసలే దొంగనాయాళ్ళ గోల ఎక్కువైంది.’ అంటూ విసుక్కుంటూ పోయాడు నారయ్య.

నారయ్య పోయిన వంకే చూస్తూ, ‘ఈయన మాట్టాడే దాంటో కూడా నిజముంది. ఎన్ని రోజులు చాకిరీ చేసినా కుక్కతోక బెత్తెడే కదా! ఇద్దరిమీ ఈళ్ళనే కనిపెట్టుకోని ఉండా కూడా కనికరమే లేకపోయెనే’ అనుకుంది సుబ్బులు.

❋❋❋

బుర్రున శబ్దం చేసుకుంటూ వచ్చిన సుమోలో నుంచి దిగారు రామినీడు, ఆయన స్నేహితులు. వందెకరాల రొయ్యల చెరువుల ఆసామి కావడం వల్లా, దీనితో పాటుగా ఇంకా అనేకరకాల వ్యాపారాలుండడం వల్లా ఎప్పుడూ వెనక మనుషులుండడం రామినీడుకు అల వాటు. అది ఆయన హోదా, దర్పాన్నీ తెలియ జేస్తుంది.

“రామినీడూ ఈ పెట్టె” అన్నారు స్నేహి తులు. “తీసి బయట పెట్టండి వాడొచ్చి తెస్తాడు” అన్నాడు రామినీడు.

“ఏమే సుబ్బులూ! నారిగాడేడి?” అన్నాడు రామినీడు గుడెసెలోకి తొంగి చూస్తూ.

“అయ్యా! దొంగల బెడద ఎక్కువగా ఉందంట. పొద్దు గూట్లో పడేసరికే పడమట పక్కకి పోయాడయ్యా. అయ్యగారొస్తే కేకెయ్య మన్నాడు కేకేసి వస్తాను” అన్నది సుబ్బులు.

“సరేగానీ ఆ బండ్లో సామానుండయ్యి తీసుకొచ్చి ఈడబెట్టు” అంటూ పడమట వైపుగా చెరువులు చూసుకుంటూ సాగి పోయాడు రామినీడు. అయన్ను అనుసరిం చారు స్నేహితులు.

“ఏమి సరుకులబ్బా, మా కోసం ఈయనెప్పుడూ ఏమీ తెచ్చిన పాపాన పోలేదే, అనుకుంటూ బండి దగ్గరకొచ్చి అట్టపెట్టె పైకెత్తింది. సీసాలు గలగలలాడాయి. ఓహో తాగుడు సామగ్రా అనుకుంటూ పెట్టెని

# తొండలకు విషం ఉంటుందా!

బల్లి పడితే ఆహారం విషతుల్యం అవుతుంది అంటారు. దీనికి శాస్త్రీయంగా ఆధారాలు కనబడలేదు. అయితే విషం కలిగిన పాములు చాలా ఉన్నాయి. ఇది మనకి తెలుసు. మరి విషం ఉన్న తొండల విషయం.


తొండలకు విషం ఉండడం రెండు సందర్భాలలోనే కనబడుతుంది. ఇవి మెక్సికో, యు.ఎస్.ఏ. దక్షిణ ప్రాంతంలో కనబడతాయి. ఎడారి ప్రాంతాలలో తారసపడతాయి. వీటిని గిలామాన్స్ టర్‌లు అని, పూసల తొండలు అనీ అంటారు. గిలా హీలా (HEELA) అని ఉచ్చరిస్తారు. అర మీటరు పైబడే ఉం టాయి. HELODERMA SUSPECTUM అం టారు. ఇలా మరొక జాతి కూడా ఉంది.


పాములకి విషగ్రంథులు పై దవడలో ఉంటాయి. కానీ వీటికి కింది దవడలో ఉంటాయి. విషం తీవ్రమైనదే చాలా విషసర్పాలకంటే ప్రమాదకర మైనది.

ఎడారివాసి కాబట్టి అక్కడి ఎండకి తట్టుకోలేదు. చలికీ తట్టుకోలేదు. పరిస్థితులు బాగుంటే బాగానే వేటాడి తింటుంది. కొవ్వు అంతా తోకలో దాచుకుంటుంది. అందుకే తోక బలి ష్ఠంగా ఉంటుంది. ఆహారం లభ్యం కానప్పుడు ఇదే దానికి ధాన్యాగారం. సాధారణంగా ఇవి మనిషిని కరిచిన సందర్భాలు లేవు. అయితే అజాగ్రత్తగా వాటిని చేతిలోకి తీసుకున్నా ఇతరత్రా ప్రమాదం ఉంది. చావులు సంభవించిన దాఖలాలు లేవు. కాని విషం వల్ల తీవ్ర అసౌ కర్యం కలుగుతుంది.



– జమ్మి కోనేటిరావు





## నేనేమైనా గోవిందాననుకున్నావా...!

ఇటీవల ఓ కార్యక్రమం కోసం లండన్ వెళ్ళిన రాణీముఖర్జీకి ఓ చేదు సంఘటన ఎదురైంది. అక్కడే స్థిరపడిన ఓ భారతీయుడుకి హోటల్లో రాణీముఖర్జీ ఎదురవ్వడంతో మర్యాద పూర్వకంగా నవ్వి ప్రక్కకు తప్పుకున్నాడట! దాంతో రాణీముఖర్జీ 'ఏంటి ఆటోగ్రాఫ్ కావాలా?' అంటూ అతను అడక్కుండానే, అతని చేయిపట్టి లాగేసుకుని చేతిమీద ఏదో పిచ్చి గీత గీసి చెయ్యి వదిలేసిందట! అంతే! "నేనేమన్నా గోవిందానను కున్నావా? నువ్వు ఛీ కొట్టినా వెంటపడటానికి? అసలు నిన్ను ఆటోగ్రాఫర్ ఎవరడిగారు" అంటూ దుమ్ము దులిపేశాడట! ఏడవాలో, నవ్వాలో అర్థంగాక అక్కడి నుంచి తప్పించుకుందట రాణీ! అవును మరి! అతన్న మాటల్లోనూ నిజముందేమో!

భుజానికెత్తుకుని తెచ్చి గుడిసె దగ్గర పెట్టింది.

"ఏం నారయ్యా! ఎవురన్నా తగుల్తున్నారా" అన్నాడు రామినీడు." తలకు చుట్టుకున్న గుడ్డ తీసి భుజానేసుకుంటూ "ఒకడూ అరా తారట్లాడతానే ఉండారయ్యా అదిలించి తోలెయ్యడం బలే పాణానికొత్తంది. అటు తోల్తే ఇటు, ఇటు తోల్తే అటు తెగ అల్లాడిత్తండారయ్యా" అన్నాడు నారయ్య.

"జాగ్రత్త నారయ్యా, రొయ్యలు మంచి కౌంటుకి వచ్చుండయ్యి. పీసు పోతే వంద మనయ్యి కానట్లే. సరేగానీ ఆడ అట్టపెట్టుంది అదీ, చాపా తీసుకొనిరా. మేము అటు పక్కన ఉంటాము" అంటూ ముందుకు సాగాడు.

నారయ్య చాప తెచ్చి పరిచి, దానిమీద అట్టపెట్టెలోని సామానులన్నీ తీసి సర్దాడు.

"సరే ఇంక నువ్వు పో నారయ్యా! ఆ తూరుపున గూడా జాగర్త. అటు పక్క పాలెపోళ్ళు దొంగనాయాళ్ళు" అంటూ బాటిల్స్ వైపు చూస్తూ "ఇంక కానియ్యిడ్రా" అన్నాడు రామినీడు.

చంద్రుడు చల్లని వెన్నెలను కురిపిస్తూ మబ్బుల చాటున దోబూచులాడుతున్నాడు. మేఘాలు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నాయి. ఈదురుగాలి రొద చేస్తోంది.

"రామినీడూ ఈ వెన్నెలా ఈ గాలీ ఈ ఆరుబయట వాతావరణం మందూ ఇంకా ఏదో వెలితిగా ఉందనిపిస్తోంది. .. అన్నాడు వాళ్ళల్లో ఒకడు.

"రేయ్, నోరు మూసుకొని కానియ్యండ్రా" అంటూ బాటిల్స్ కలుపుకుని చీర్స్ చెప్పుకున్నారు.

ఒక్కో గుక్కా గొంతు దిగేకొద్దీ మత్తు కూడా తలకెక్కుతుంది. ఒక్కొక్కరూ మెల్లగా సంగీతం మొదలుబెట్టారు. మాటలు కూడా మత్తు మత్తుగా నంగి నంగిగా వస్తున్నాయి. ఒక్కో సీసా ఖాళీ అవుతోంది.

మబ్బులన్నీ మూకుమ్మడిగా చుట్టుముట్టి చంద్రుణ్ణి కప్పేశాయి. మేఘాలు ఒక్కటొక్కటిగా చేరి వర్షానికి సమాయత్తమౌతున్నట్టుగా ఉన్నాయి. తెచ్చిన మందు సీసాలన్నీ ఖాళీ అయినయ్యి. అప్పటికి అర్ధరాత్రి పన్నెండయ్యింది. అందరికీ కైపు నషాలానికంటి ఉంది.

రామినీడు మొహాన రెండు చినుకులు పడ్డాయి. "రేయ్ లేవండ్రా వానొస్తోంది" అంటూ తొందరజేశాడు రామినీడు. చినుకు చినుకు కలిసి సన్నటి తుంపర మొదలైంది.

ఆ గట్టు మీద తూలుకుంటూ, వచ్చీరాని మాటలు మాట్లాడుతూ, మత్తు కళ్ళతో తల విదిలించుకుంటూ, తడబడే అడుగులతో నడుస్తూ తూలుకుంటూ గుడిసె దగ్గరికి వచ్చేసరికి వాన జడివానగా మారింది. అక్కడ చుట్టుపక్కల తల దాచుకోవడానికి ఆ గుడిసె తప్ప ఏమీ లేదు. పరిగెత్తి సుమోలో కూర్చోడానికీ ఒక్కో అడుగు కూడా వెయ్యలేని పరిస్థితిలో ఉన్నారు. అందుకే గుడిసెలోకి పోదామని లోపలికి తొంగి చూశారు.

సన్నని లాంతరు మసక వెలుతురులో సుబ్బులు పడుకుని ఉంది. జబ్బలదాకా చీర. తొలగిన పైట. అసలే మత్తులో ఉన్నారు.

ఆకలిగా నాలుక చప్పరిస్తూ ఒకరి మొహాలవంక ఒకరు చూసుకున్నారు. కళ్ళు కళ్ళు కలిశాయి.

ఆబగా పైనబడేసరికి ఎండిన డొక్కల్తో పస్తున్న పొట్టతో ఉన్న సుబ్బులు కెవ్వుమని అరిచింది. ఆ అరుపుకి పిల్లాడు లేచి గుక్కపట్టి ఏడవసాగాడు.

నోటికి చెయ్యి అడ్డుపెట్టారు. కాళ్ళూ చేతులూ గుంజుకుంటూ పెనుగులాడసాగింది. నోటిలో నుండి శబ్దం బైటికి రాలేదు.

ఒకరి తరువాత ఒకరు రాక్షసంగా, కిరాతకంగా, క్రూరంగా కోరిక తీర్చుకుని రక్తాన్ని నాలుకతో తుడుచుకుంటున్న మృగాల్లా పైకి లేచారు. సుబ్బులు చేతులు కాళ్ళల్లో చలనం ఆగిపోయింది.

"రేయ్ కదలడం లేదురా చచ్చినట్టుంది" అన్నాడు ఒకడు. తాగిన మైకం ఒక్కసారిగా దిగి పోయింది. "రేయ్ పదండి పదండి తొందరగా పదండి." అంటూ వానలో తడుచుకుంటూనే సుమో దగ్గరికి పరిగెత్తారు.

* * *

నారయ్య వర్షంలో తడుస్తూ కట్టమీద కసిగా తిరుగుతున్నాడు. కడుపులో ఆకలి పేగుల్ని మెలిపెట్టి తిప్పుతోంది. బయట చలికి కాళ్ళూ చేతులూ వంకర్లు పోతున్నాయి. పైన కప్పుకున్న పాలిథిన్ కాగితం గాలికి పైకి లేచి పోతూ ఒంటిని తడపకుండా ఉండలేక పోతోంది.

"ఈ వానకి వళ్ళంతా వంకర్లు పోతుండయ్యి. ఈ నాయాళ్ళు ఇప్పుడే తగలబడతారు. ఆదమరచి ఉంటే ఇంతకు ముందు కూడా ఒకటీ రెండుసార్లు దెబ్బేశారు. అయ్యగారిసేత ముక్కదొబ్బులు పెట్టించుకోకుండా ఉండాలంటే తప్పదు" అనుకుని నారయ్య చాలా పట్టుదలగా కాపలా కాస్తున్నాడు.

పొదలమాటున ఏదో చిన్న అలికిడైంది. ఆ! ఏందోలే అని నారయ్య పట్టించుకోలేదు. అలికిడి క్రమేణా దగ్గరౌతోంది. గుసగుసగా గాల్లో శబ్దాలు వినిపించీ వినిపించనట్టుగా ఉన్నాయి.

"రేయ్ ఎవురదీ?" అరిచాడు బిగ్గరగా నారయ్య. అలికిడి ఆగిపోయింది.

"నాయాళ్ళు అక్కడే నక్కినట్టుండారు". మళ్ళీ కదలిక. "ఏందిరా మనిషుండా గూడా బయ్యం బక్తి లేకుండా బోయింది బొత్తిగా" అంటూ కేకవేశాడు.

"అయినా దగ్గిరకే వస్తుండారే" అనుకుంటా కట్ట దిగి టార్చ్‌లైట్ వేశాడు. కళ్ళకి

చేతులు అడ్డం బెట్టుకుని కూర్చున్నారు.

"రేయ్ ఎవుర్రా మీరు? ఏం పని మీకిక్కడ?" అంటూ గద్దించాడు. అయినా ఆగకుండా ఒక్క ఊపుమీద దగ్గిరకొచ్చి నారయ్య మీద పడిపోయారు. చేతిలో టార్చ్‌లైట్ బురదలో పడిపోయింది. ఒంటిపై ఉన్న ప్లాస్టిక్ కాగితం గాలిలో ఎగిరిపోయింది.

"రేయ్ ఎవుర్రా మీరు?" అంటూ చేతిలో కర్ర పైకెత్తాడు. అంతే వెనక నుండి ఒక్కటేదెబ్బ పడింది. దాంతో నారయ్యకు తల దిమ్మెక్కినట్టుగా ఉంది. అయినా కర్ర వదలకుండా పెనుగులాడుతున్నాడు. మైకం కమ్ముతున్నట్టుగా ఉంది. నోట్లో నుండి మాట పెగిలి రావడం లేదు.

అందరి మధ్యా ఒక్కడూ పెనుగులాడుతున్నాడు. అరుపులు కేకలతో ఆక్కడ వాతావరణం భయానకంగా ఉంది. వాళ్ళు గుద్దిన పిడిగుద్దులతో స్పృహ తప్పుతున్నట్లుగా ఉంది నారయ్యకు. తలపై నుండి రక్తపు చారికలు వానలో కలిసి ఎర్రగా కారుతున్నాయి.

"అయ్యయ్యో ఈళ్ళెవురో మంచి ప్లానుమీదొచ్చినట్టున్నారు. యాడా చూసిన మొకాలు గూడా కాదే. యాణ్ణో దూరాబారం నుంచి వచ్చినట్టుండారు. అయ్యో! అయ్యయ్యో రొయ్యలు రొయ్యలు అయ్యగారు ఎంత నమ్మకంగా నా మీద వదిలేసిపోయారు. ఆ అబ్బా" అంటూ తల పట్టుకుని స్పృహతప్పి నేల మీద దబ్బున పడ్డాడు.

"రేయ్ ఇంక పదండిరా వొరిగిపోయాడు. నాయాలు ఎంత ఇదిగా నీలిగాడు. అబ్బో నలుగురు మదుసులకి సమాదానం జెప్పేడు. ఇంతకీ పేణం ఉండట్టా పోయినట్టా" అని ముక్కు దగ్గర వేలుబెట్టి చూశాడు వాళ్ళల్లో ఒకడు. "ఆ బతికే ఉండాళ్ళే పదండి" అంటూ చెరువు గట్టెక్కి వల విసిరారు.

* * *

"ఎక్కడున్నా నేను? ఏం జరిగింది నాకు? వొళ్ళంతా ఈ నెప్పులేంది? తల దిమ్ముగా ఉందే అని తల పట్టుకుని చూశాడు. చేతికి ఎర్రగా రక్తమైంది. ఓ ఎవెరో వొచ్చేరుగదా అని అప్పుడు గుర్తొచ్చింది మరలా స్పృహలోకొచ్చే సరికి నారయ్యకు "ఏరీ? వాళ్ళేరీ? ఎల్లినట్టుండారే" అంటూ పైకి విసురుగా లేవబోయాడు. వొంట్లో ఏ ఒక్క అవయవమూ సహకరించలేదు. అరే మళ్లీ నా నెత్తిమీదకి వొచ్చుద్దే. అయ్యగారుంటే ఆయనకి చెబితే సరిపోయిద్దే! ఉండారో ఎల్లిపోయారో! ఎట్టన్నా లేవాలే. అయ్యో లేవలేకపోతుండానే. ఆ అమ్మా అయ్యా" అనుకుంటూ చేతి బిర్రుమీద పైకి లేచాడు. కాలు నిలదొక్కుకోలేక మళ్ళీ కింద పడిపోబోయేడు. తమాయించుకుని నిలబడ్డాడు.

ఒక్కో అడుగులో అడుగు వేసుకుంటూ, తూలుకుంటా వర్షంలో తడుస్తూ, తల విదిలిచ్చుకుంటా ఎరుపెక్కిన కళ్ళతో దొంగల్ని పట్టుకోలేకపోయానన్న ఉక్రోషంతో గుడిసె దగ్గరకు చేరాడు. పిల్లోడు గుక్కపట్టి ఏడుస్తున్నాడు.

"స్సు..బ్బు...స్సు...బ్బు...లూ ఒసేయ్ సుబ్బులూ ఎంత మొద్దు నిద్రపోతుండావే. యేయ్ నిన్నేనే" అంటూ పెద్దగా అరిచాడు. అయినా లోపల్నుండి సమాధానం వినపడలేదు. పిల్లోడి ఏడుపు పెరిగింది.

"ఏందీ నిన్ను గాదంటే పిలుత్తుంటే ఇల్లంతా వాన నీళ్ళతో తడిసిపోతుంటే ఏందే? ఏనుగులు తొక్కినా లేసేటట్టు లేవుగదే!"

లాంతరు వొత్తి పెద్దదిగా చేసి, దగ్గరగా వచ్చి కదిలించి చూశాడు. కదల్లేదు.

"ఏయ్ సుబ్బులూ ఏందే! పలకవేందే.. ఆ చీర అయ్యో ఏందే? అయ్యొ ఆ అయ్య సుబ్ ఏదో అర్ధమైనట్లుగా "సుబ్బులూ" అంటూ పెద్దగా వెర్రికేక వేశాడు. కళ్ళల్లో నుండి బొట బొటా కన్నీరు కార్చాడు.

పిల్లోడిని ఎత్తుకుని వాడి వంకా సుబ్బులు వంకా చూస్తూ వెర్రిగా ఏడుస్తూ "నా కొడుకులు.. దొంగలు వాళ్ళా ఈళ్ళా కడుపు కూటికోసం వాళ్ళు.. వాళ్ళదేం తప్పు. దొరతనం ఆంకారం, మదం కళ్ళుకెగదన్ని తాగిన మత్తు కమ్మిన మైకం ఎగిసొచ్చిన కామం ఎగదన్నుకొచ్చినప్పుడు ఎవుర్నయినా పొట్టన బెట్టుకుంటారు."

"సుబ్బులూ ఒసే సుబ్బులూ ఒక్కసారి లేయే. పిల్లోడికోసరమన్నా లేయే. ఒక్కసారి మాట్టాడవే. అయ్యగారు అయ్యగారనీ వాళ్ళ చెరువుల్ని కాపాడాల.. వాళ్ళ ఆస్తిపాస్తుల్ని కాపాడాల. వాళ్ళని పెంచి పెద్దజెయ్యాల మనం మాత్రం నాశనమైపోవాల" అంటూ సుబ్బులు మీద పడి చిన్నపిల్లల్లా రోదించ సాగాడు. పిల్లాడు కూడా ఏడుపు ఆపకుండా ఏడుస్తూనే ఉన్నాడు. బయట వర్షం ఆగకుండా కురుస్తూనే ఉంది. *



# ఎయిడ్స్ గణాంక వివరాలు

ప్రపంచ వ్యాప్తంగా 2004 నాటికి 51 మిలియన్ల జనం ఎయిడ్స్‌తో బాధపడుతున్నారు. వీరిలో పెద్దలు 37 మిలియన్లు, పిల్లలు (15 సం.లోపు) 2.5 మిలియన్లు.



2003 లో ఎయిడ్స్ వ్యాధి వలన మరణించినవారి సంఖ్య 30 లక్షలు.

ప్రపంచ వ్యాప్తంగా కొత్తగా ఎయిడ్స్ సోకినవారి వివరాలు :

ఉత్తర అమెరికా 44,000
ఉత్తర ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ 75,000
తూర్పు ఆసియా 2 లక్షలు
దక్షిణ, ఆగ్నేయాసియా 8,50,000
ఆస్ట్రేలియా 5,000
లాటిన్ అమెరికా 2,00,000
సబ్-సహారా ఆఫ్రికా 30,00,000

2004 సెప్టెంబరు 30 నాటికి భారత్‌లో ఎయిడ్స్ సోకినవారి సంఖ్య 91,076 మంది. మొదటి స్థానంలో తమిళనాడు (40,214), రెండో స్థానంలో మహారాష్ట్ర 12,783, మూడవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ 9,549 నిలిచాయి.

1990 లో ప్రపంచంలో కేవలం 2 లక్షల మంది ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు ఉండగా 2003 నాటికి వీరి సంఖ్య 51 మిలియన్లకు చేరింది.

- గాయత్రి